విజయవాడలో ఓజీ?

ప్రస్తుతం పవన్‌కల్యాణ్ చేతిలో ఉన్న సినిమాలు హరిహరవీర మల్లు, ఓజీ, ఉస్తాద్ భగత్‌సింగ్. ఈ మూడు చిత్రాలనూ పూర్తి చేస్తానని సదరు చిత్రాల నిర్మాతలకు పవన్ భరోసా ఇచ్చేశారు. అందులో భాగంగా ముందు ఆయన 'ఓజీ' సినిమాను పూర్తి చేయాలని నిర్ణయించారు. ఇప్పటికే దాదాపుగా 80శాతం ఈ సినిమా పూర్తయింది. ముంబై నేపథ్యంలో గ్యాంగ్‌స్టర్స్ కథాంశంగా తెరకెక్కుతున్న 'ఓజీ' సినిమా షూటింగ్‌ని దర్శకుడు సుజిత్ సెప్టెంబర్‌లో ప్లాన్ చేశారు. కథ రిత్యా ఇది ముంబై నేపథ్యమే అయినా.. ఇందులో కథానాయకుడి పాత్రకు విజయవాడతో సంబంధం ఉంటుందట. అందుకే విజయవాడకు సంబంధించిన సన్నివేశాలతో పాటు ముంబై సీన్స్‌ని కూడా దర్శకుడు సుజిత్ విజయవాడలోనే ప్లాన్ చేశారట. పవన్‌కి ఇబ్బంది లేకుండా అక్కడే ముంబైని తలపించే ఓ సెట్‌ని నిర్మించే పనిలో ఉన్నారట చిత్ర యూనిట్. విజయవాడకు సంబంధించిన సన్నివేశాలను అవుట్‌డోర్‌లో చిత్రీకరించి, ముంబై సీన్స్‌ని సెట్‌లో పూర్తి చేస్తారట. ఈ సినిమాకోసం వారానికి రెండు రోజులు మాత్రమే పవన్ డేట్స్ కేటాయించినట్టు తెలుస్తున్నది. పవన్ పార్ట్ పూర్తి చేసిన తర్వాత పోస్ట్ ప్రొడక్షన్‌పై దృష్టిసారిస్తారట సుజిత్. ఈ ఏడాది చివరల్లో 'ఓజీ'ని విడుదల చేయడానికి నిర్మాత డీవీవీ దానయ్య ప్లాన్‌చేస్తున్నారు. ఇందులో ప్రియాంక అరుళ్ మోహన్ కథానాయికగా నటిస్తున్న విషయం తెలిసిందే.

పాటకోసం మూడు కోట్లు

కంటెంట్‌ని నమ్మి సినిమా తీయడం.. క్వాలిటీ విషయంలో వెనుకడుగు వేయకపోవడం గీతాఆర్ట్స్ స్పెషాలిటీ. అందుకే.. గీతాఆర్ట్స్ అంటే భారీ తనానికి కేరాఫ్ అడ్రస్ అంటారు. ప్రస్తుతం ఈ సంస్థ నిర్మిస్తున్న చిత్రం 'తండేల్'. నాగ చైతన్య, సాయిపల్లవి ప్రధాన పాత్రధారులుగా చందు మొండేటి దర్శకత్వంలో బన్నీవాసు నిర్మిస్తున్న ఈ చిత్రం ప్రస్తుతం శరవేగంగా చిత్రీకరణ జరుపుకుంటున్నది. కథ రిత్యా ఈ సినిమాలోని ఓ కీలకమైన గీతాన్ని మేకర్స్ సిటీకి దూరంగా నిర్మించిన ఓ భారీ సెట్‌లో చిత్రీకరిస్తున్నారు. కేవలం ఈ ఒక్క పాటకోసం మూడు కోట్లు ఖర్చు చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. శ్రీకాకుళం నేపథ్యంలో సాగే కథ కావడంతో అక్కడి జాతర్లలో రకరకాల వేషాలు వేసే పేరుమోసిన శ్రీకాకుళం కళాకారులు 65మందిని ఈ పాటకోసం మేకర్స్ రప్పించారు. తొమ్మిదివందల మంది డాన్సర్లు, జూనియర్ ఆర్టిస్టులు కూడా ఈ పాటలో పాల్గొంటున్నారు. ఈ పాట కోసం వేసిన భారీ సెట్, ఈ పాటలో పాల్గొన్న కళాకారులు, కళారూపాలు, శ్రీకాకుళం వాతావరణాన్ని తలపించేందుకు చేసిన ప్రయత్నాలు.. వీటన్నింటికీ కలిపి రఫ్‌గా మూడుకోట్లు ఖర్చు తేలిందని యూనిట్ వర్గాల భోగట్టా. నాగచైతన్య కెరీర్‌లో ఒకపాటకు మూడు కోట్లు ఖర్చు చేయడం ఇదే ప్రథమం. శ్రీకాకుళంలో జరిగిన ఓ హృద్యమైన సంఘటన ఆధారంగా తెరకెక్కుతున్న ఈ ప్రేమకథపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలు ఉన్నాయి.

తొలిసారి ప్రత్యేకగీతం

సుదీర్ఘమైన కెరీర్‌లో అగ్ర కథానాయిక త్రిష ఇప్పటివరకు ప్రత్యేకగీతాల్లో నర్తించలేదు. ఆమె సమకాలీన నాయికలు చాలా మంది స్పెషల్ సాంగ్స్‌లో మెరిసి అభిమానులను అలరించారు. తాజా సమాచారం ప్రకారం త్రిష తొలిసారి ప్రత్యేకగీతంలో నటించినట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే.. తమిళ అగ్ర హీరో దళపతి విజయ్ నటిస్తున్న తాజా చిత్రం 'GOAT (గ్రేటెస్ట్ ఆఫ్ ఆల్‌టైమ్) వచ్చే నెలలో విడుదలకు సిద్ధమవుతున్నది. వెంకట్‌ప్రభు దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని సైన్స్ ఫిక్షన్, దేశభక్తి ప్రధానాంశాలుగా తెరకెక్కిస్తున్నారు. విజయ్ ద్విపాత్రాభినయంలో కనిపిస్తారు. ఈ సినిమాలో త్రిష అతిథి పాత్రలో నటిస్తుందని గత కొంతకాలంగా వార్తలొస్తున్నాయి. తాజాగా ఆమె ఓ స్పెషల్‌సాంగ్‌లో నటించిందని దర్శకుడు వెంకట్‌ప్రభు వెల్లడించారు. త్వరలో ఈ పాటను విడుదల చేస్తామని ఆయన అన్నారు. తమిళంలో విజయ్-త్రిష హిట్‌పెయిర్‌గా గుర్తింపుతెచ్చుకున్నారు. వారిద్దరు కలిసి ఐదు చిత్రాల్లో నటించగా.. అవన్నీ బాక్సాఫీస్ వద్ద భారీ విజయాలను సాధించాయి. దాంతో హిట్ సెంటిమెంట్‌ను గౌరవిస్తూ వారిద్దరిపై ఓ స్పెషల్ సాంగ్‌ను ప్లాన్ చేశారని తెలిసింది. 'గోట్' తెలుగు వెర్షన్‌ను అగ్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ విడుదల చేస్తున్నది.

జ్ఞాపకాల దొంతర సుందరకాండ

'ఇదొక పెక్యులర్ లవ్‌స్టోరీ. ఈ జర్నీ చాలా స్పెషల్. దర్శకుడు వెంకటేశ్ మంచి కథ రాసుకున్నాడు. నిర్మాతలు సంతోష్, గౌతమ్, రాకేష్‌లు కథను బాగా నమ్మారు. ఈ కథే మా అందర్నీ కలిపింది. ఈ సినిమాకు అన్నీ బాగా కుదిరాయి. మంచి కంటెంట్‌తో రాబోతున్నాం. ఆదరిస్తారని నమ్ముతున్నా' అని నారా రోహిత్ అన్నారు. ఆయన కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'సుందరకాండ'. వృత్తి వాఘని, శ్రీదేవి విజయ్‌కుమార్ కథానాయికలు. వెంకటేశ్ నిమ్మలపూడి దర్శకుడు. సంతోష్ చిన్నపోళ్ల, గౌతమ్‌రెడ్డి, రాకేష్ మహంకాళి నిర్మాతలు. ఈ సినిమా నిర్మాణం తుదిదశకు చేరుకుంది. మేకర్స్ ప్రమోషన్స్ స్టార్ట్ చేశారు. ఇందులో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో నిర్వహించిన ఓ కార్యక్రమంలో ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ఈ సందర్భంగా నారా రోహిత్ మాట్లాడారు. టీజర్ లాగే సినిమా కూడా క్లీన్ ఎంటర్‌టైనర్ అనీ, సినిమా చూసిన వాళ్లు మంచి మెమరీస్‌తో ఇంటికెళ్తారని దర్శకుడు చెప్పారు. ఇంకా చిత్ర యూనిట్ మొత్తం మాట్లాడారు. నరేశ్, వాసుకి ఆనంద్, సత్య, అజయ్, వీటీవీ గణేశ్, అభినవ్ గోమఠం రూపాలక్ష్మీ తదితరులు నటించిన ఈ చిత్రానికి కెమెరా: ప్రదీప్ ఎం.వర్మ, సంగీతం: లియోన్ జేమ్స్.

మంచు విష్ణు తనయుడి అరంగేట్రం

హీరో మంచు విష్ణు తనయుడు మంచు అవ్రామ్ 'కన్నప్ప' చిత్రం ద్వారా వెండితెరపై అరంగేట్రం చేస్తున్న విషయం తెలిసిందే. అవ్రామ్ పాత్రకు సంబంధించిన ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను సోమవారం సీనియర్ నటుడు మంచు మోహన్‌బాబు విడుదల చేశారు. ఈ సినిమాలో తిన్నడు బాల్యానికి సంబంధించిన పాత్రలో అవ్రామ్ కనిపించబోతున్నాడు. కాళీమాత విగ్రహం బ్యాక్‌డ్రాప్‌లో ఫస్ట్‌లుక్ పోస్టర్ ఆకట్టుకునేలా ఉంది. మంచు విష్ణు టైటిల్ రోల్‌ని పోషిస్తున్న 'కన్నప్ప' చిత్రానికి ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వం వహిస్తున్నాడు. పాన్ ఇండియా స్థాయిలో డిసెంబర్‌లో ప్రేక్షకుల ముందుకురానుంది. శివుడి అపరభక్తుడైన కన్నప్ప జీవితగాథ ఆధారంగా భక్తిరస ప్రధానంగా ఈ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. ఇందులో మోహన్‌లాల్, మంచు మోహన్‌బాబు, ప్రభాస్, అక్షయ్‌కుమార్, శివరాజ్‌కుమార్ వంటి అగ్ర తారలు భాగమయ్యారు. అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ పతాకంపై మంచు మోహన్‌బాబు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

ఈ పాట విఫల ప్రేమికులకు అంకితం



రాజ్ తరుణ్ తాజా సినిమా 'భలే ఉన్నాడే'. మనీషా కంద్కూర్ కథానాయిక. వర్ధన్ దర్శకుడు. ఎన్‌వీ కిరణ్‌కుమార్ నిర్మాత. అగ్ర దర్శకుడు మారుతి సమర్పకుడు. సెప్టెంబర్ 7న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమాలో 'సోఫియా..' అంటూ సాగే పాటను హీరో విశ్వక్‌సేన్ చేతుల మీదుగా మేకర్స్ విడుదల చేశారు. దేవ్ రాసిన ఈ పాటను శేఖర్ చంద్ర స్వరపరచగా, కరీముల్లా ఆలపించారు. విఫల ప్రేమికులకు అంకితమిచ్చేలా ఈ పాటను రూపొందించడం జరిగిందని మేకర్స్ తెలిపారు. అమ్మాయిలంటే ఆమడ దూరంలో వుండే కుర్రాడిగా ఇందులో రాజ్‌తరుణ్ కనిపించనున్నాడు. వీటీవీ గణేశ్, హైపర్ ఆది, కృష్ణభగవాన్, శ్రీకాంత్ అయ్యంగార్, సింగీతం శ్రీనివాస్, అభిరామి, గోపరాజు రమణ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: నగేశ్ బానెల్లా.

మత్తు వదలరా- 2 వచ్చేస్తోంది

శ్రీసింహా, కమెడియన్ సత్య ప్రధాన పాత్రల్లో రితేష్ రానా దర్శకత్వంలో తెరకెక్కిన కామెడీ ఎంటర్‌టైనర్ 'మత్తు వదలరా..'. 2019 డిసెంబర్ 25న విడుదలైన ఈ సినిమా ప్రేక్షకులను బాగా ఆకట్టుకుంది. ఇదిలావుంటే.. ఈ సినిమా సీక్వెల్ 'మత్తు వదలరా 2'ని కూడా కామ్‌గా మేకర్స్ పూర్తి చేసేశారు. సెప్టెంబర్ 13న సినిమా విడుదల కానున్నదని తెలియజేస్తూ సోమవారం ఓ పోస్టర్‌ని కూడా మేకర్స్ విడుదల చేశారు. ఈ పోస్టర్‌లో యాక్షన్ మోడ్‌లో ఉన్న శ్రీసింహా, సత్యలను చూడొచ్చు. క్లాప్ ఎంటర్‌టైన్‌మెంట్స్, మైత్రీ మూవీమేకర్స్ కలిసి నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం: కాలభైరవ.

పటేల్‌ని ఉరికించిన ఆ అమ్మాయి ఎవరు?

'హుషారు'ఫేం తేజస్ కంచర్ల నటించిన చిత్రం 'ఉరుకు పటేలా'. 'గెట్ ఉరికిఫైడ్' ఉపశీర్షిక. వివేక్‌రెడ్డి దర్శకుడు. కంచర్ల బాలభాను నిర్మాత. సెప్టెంబర్ 7న సినిమా విడుదల కానుంది. ప్రమోషన్‌లో భాగంగా ఈ సినిమా ట్రైలర్‌ని విడుదల చేశారు. ట్రైలర్‌ను గమనిస్తే.. హీరోకి చదువు లేదు. కానీ చదువుకున్న అమ్మాయిని పెళ్లాడాలనుకున్నాడు. అలాంటమ్మాయి దొరక్క, వయసు ముదురుతున్నా పెళ్లికాక బాధపడుతున్నాడు. ఇంతలో సరిగ్గా అతని ఆశలకు తగ్గ అందమైన అమ్మాయి ప్రేమించింది. ఎంతోమంది అమ్మాయిలు రిజక్ట్ చేసిన హీరోని ఈ అమ్మాయి ఎందుకు ప్రేమించిందబ్బా.. అని అందరూ అనుకుంటున్న సమయంలో ఆ అమ్మాయి అసలు కోణం బయటపడింది. హీరోకి గుండె ఆగినంత పని అయ్యింది. పారిపోవాలనుకున్నాడు. ఇంతకీ ఆ అమ్మాయి ఎవరు? ఏం చేసింది? ఆమెను చూసి హీరో ఎందుకు భయపడుతున్నాడు? ఈ ప్రశ్నలన్నీ ట్రైలర్ చూస్తే ఉత్పన్నమవుతాయి. ఖుష్బూ చౌదరి కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రానికి కెమెరా: సన్నీ కూరపాటి, సంగీతం: ప్రవీణ్ లక్కరాజు.

వైవిధ్యమైన యాక్షన్ డ్రామా

జాకీఫ్రాఫ్, ప్రియమణి, సన్నీలియోన్, సారా అర్జున్ ప్రధాన పాత్రధారులుగా రూపొందిన చిత్రం 'క్యూజీ గ్యాంగ్ వార్'. వివేక్‌కుమార్ కన్నన్ స్వీయ దర్శకత్వంలో ఎం.వేణుగోపాల్, గాయత్రి సురేశ్‌లతో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించారు. ఈ నెల 30న అయిదు భాషల్లో సినిమా విడుదల కానుంది. ఎన్టీఆర్ శ్రీను సమర్పణలో వస్తున్న ఈ సినిమాకు సంబంధించిన తెలుగు వరల్డ్‌వైడ్ రిలీజ్ హక్కులను రిషికేశ్వర్ ఫిల్మ్స్ బ్యానర్ కింద నిర్మాత వేణుగోపాల్ సొంతం చేసుకున్నారు. సోమవారం హైదరాబాద్‌లో ఈ సినిమా ట్రైలర్ లాంచ్ ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి అతిథులుగా విచ్చేసిన టి.ప్రసన్నకుమార్, దామోదర్‌ప్రసాద్, శివ నాగు, శ్రీను, తదితరులు సినిమా ఘనవిజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇది వైవిధ్యమైన సినిమా అనీ, యాక్షన్ సినిమాలు ఇష్టపడే వారికి ఇది విందుభోజనం లాంటి సినిమా అని మేకర్స్ తెలిపారు. ఈ చిత్రానికి కెమెరా: అరుణ్ పద్మనాభన్, సంగీతం: డ్రమ్స్ శివమణి.

హారర్ థ్రిల్లర్ 'కళింగ'

స్వీయ దర్శకత్వంలో ధృవ వాయు హీరోగా నటిస్తున్న చిత్రం 'కళింగ'. దీప్తి కొండవీటి, పృథ్వీ యాదవ్ నిర్మాతలు. సెప్టెంబర్ 13న విడుదలకానుంది. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. హీరో, దర్శకుడు ధృవ వాయు మాట్లాడుతూ 'లవ్, ఎమోషన్స్, కామెడీ, హారర్, థ్రిల్లర్ అన్ని అంశాలు కలబోసిన చిత్రమిది. తెలుగులో ఇప్పటివరకు ఈ తరహా కాన్సెప్ట్ రాలేదు. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలకు మంచి స్పందన లభిస్తున్నది' అన్నారు. అధికభాగం చిత్రీకరణ అడవుల్లో జరిపామని, విజువల్స్‌పరంగా ప్రేక్షకులకు కొత్త అనుభూతినందిస్తుందని నిర్మాతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్ర యూనిట్ సభ్యులందరూ పాల్గొన్నారు.

జాతకం మారిపోయింది

ప్రస్తుతం హిందీ చిత్రసీమలో కథానాయిక శ్రద్ధాకపూర్ పేరు మార్మోగిపోతున్నది. ఇటీవల విడుదలైన 'స్త్రీ-2' చిత్రంతో కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌ను తన ఖాతాలో వేసుకుందీ భామ. దాదాపు 400కోట్లకు పైగా వసూళ్లతో ఈ సినిమా బాక్సాఫీస్ రేసులో దూసుకుపోతున్నది. ఇందులో శ్రద్ధాకపూర్ నటనకు సర్వత్రా ప్రశంసలు దక్కుతున్నాయి. ఈ విజయంతో ఓ అరుదైన ఘనతను సొంతం చేసుకుంది శ్రద్ధాకపూర్. ఇప్పటివరకు ఆమె నటించిన సినిమాల మొత్తం వసూళ్లు 1603 కోట్లను దాటాయి. దీంతో ఈ భామ అగ్ర కథానాయిక ప్రియాంక చోప్రాను అధిగమించింది. బాలీవుడ్ హీరోయిన్స్ లైఫ్‌టైమ్ కలెక్షన్స్ జాబితాలో 3195 కోట్లతో దీపికా పడుకోన్ అగ్రస్థానంలో ఉండగా కత్రినాకైఫ్, కరీనాకపూర్, అలియాభట్ ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నారు. 'స్త్రీ-2' వసూళ్లతో శ్రద్ధాకపూర్ ఈ జాబితాలో ఐదో స్థానానికి చేరుకుంది. మరో విశేషం ఏమిటంటే..ఇప్పటివరకు బాలీవుడ్ ఖాన్‌త్రయం అమీర్ ఖాన్, సల్మాన్‌ఖాన్, షారుఖ్ ఖాన్ చిత్రాల్లో కథానాయికగా నటించకుండానే ఆమె ఈ ఫీట్‌ను సాధించడం విశేషం. కథాంశాల ఎంపికలో వైవిధ్యం, ఇండస్ట్రీలో వివాదాలకు దూరంగా క్లీన్ ఇమేజ్ కలిగి ఉండటం శ్రద్ధాకపూర్‌కు సానుకూలాంశాలుగా మారాయని, భవిష్యత్తులో ఆమె బాలీవుడ్‌లో అగ్ర తారగా నిలవడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.

తల్లి మనసుకు దర్పణం

రచిత మహాలక్ష్మి, కమల్ కామరాజు, సాత్విక్, సాహిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం 'తల్లి మనసు'. సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య తనయుడు అనంతకిషోర్ నిర్మిస్తున్నారు. వి.శ్రీనివాస్ (సిప్పీ) దర్శకుడిగా పరిచయమవుతున్నాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. ప్రధాన తారాగణం పాల్గొనగా కథానాయిక ఇంటికి సంబంధించిన సన్నివేశాలను తెరకెక్కిస్తున్నారు. ముప్పైశాతం చిత్రీకరణ పూర్తయిందని, కుటుంబ బంధాల గొప్పతనాన్ని ఆవిష్కరిస్తూ మధ్యతరగతి తల్లి మనసుకు అద్దం పట్టే చిత్రమిదని మేకర్స్ తెలిపారు. రఘుబాబు, శుభలేఖ సుధాకర్ తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: కోటి, స్క్రీన్‌ప్లే, దర్శకత్వం: వి.శ్రీనివాస్ (సిప్పీ).

సుబ్బమ్మ కథాకమామీషు

శ్యామ్ షెల్వన్, హాన్విక, రితిక, గ్రీష్మ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'ఈమె సుబ్బమ్మ ఇదియే ఈమె కథ' చిత్రం ఇటీవల హైదరాబాద్‌లో ప్రారంభమైంది. కిరణ్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని ఎం.ఎం.ఆర్ట్ క్రియేషన్స్ పతాకంపై మంద మల్లికార్జున రెడ్డి నిర్మిస్తున్నారు. యువతతో పాటు కుటుంబ ప్రేక్షకులు మెచ్చే కథాంశమిదని, ప్రతి ఒక్కరిని ఆలోచింపజేసే సందేశం ఉంటుందని దర్శకుడు కిరణ్ తెలిపారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో సెప్టెంబర్ నుంచి రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తామని నిర్మాత మల్లికార్జున రెడ్డి పేర్కొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: గాజుల శివ, సంగీతం: చరణ్ అర్జున్.